## క్లుప్తంగా

### పనికి తగిన వేతనం ఇవ్వాలి



ఎంఈఓ బాబ్జీకి వినతి పత్రాన్ని సమర్పిస్తున్న సీఆర్పీలు

**పాకాల:** రాష్ట్ర ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని ఎమ్మార్సీ కేంద్రంలో ఎంఈఓ బాబ్జీకి వినతి పత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ చాలీ చాలని జీతంతో బతుకులు నెట్టుకొస్తున్నామని, ఇచ్చే జీతాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదని, సీఆర్పీలకు టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. ఈ విషయమై రాష్ట్రంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు అందరూ సామూహిక సెలవులు పెట్టడుతున్నామని, అలాగే ఈ నెల 15వ తేదీ వరకు పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. 20వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తున్నామన్నారు. సీఆర్పీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### తెలంగాణలో నియంతృత్వ పాలన అంతం

**తిరుమల:** తెలంగాణలో ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం వచ్చిందని తెలంగాణలోని చెన్నూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చెప్పారు. శనివారం వేకువజామున వివేక్ వెంకటస్వామి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ వెలుపలకు ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుటుంబం దోపిడీపై శ్వేత పత్రం విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించామని తెలిపారు. ధరణి పోర్టల్‌తో కల్వకుంట్ల కుటుంబం భూ దందాకు పాల్పడిందని విమర్శించారు.

### నిర్మాణ పనులను వేగవంతం చేయండి



భవనాలను పరిశీలిస్తున్న జేఈఓ సదాభార్గవి

**తిరుపతి తుడా:** భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి ఆదేశించారు. శనివారం శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ( స్విమ్స్) సందర్శించిన ఆమె స్విమ్స్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ భవన సముదాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి భవన నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎంబీబీఎస్ విద్యను అభ్యసించే విద్యార్థినుల సౌకర్యార్థం నిర్మిస్తున్న ఐదంతస్తుల అదనపు గదుల హాస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సకాలంలో అందుబాటు లోనికి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి.కుమార్, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ జయచంద్ర రెడ్డి, టీటీడీ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 8 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 54,523 మంది స్వామివారిని దర్శించుకోగా, 20,817 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.40 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### స్విమ్స్‌లో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు

**తిరుపతి కల్చరల్:** స్విమ్స్ టీటీడీ వారి ఆధీనంలోకి వచ్చిన తర్వాత టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ.ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి సహకారంతో ఆసుపత్రి అభివృద్ధికి వినూత్న సంస్కరణలు తీసుకువస్తున్నారు. ప్రజలకు అత్యున్నత వైద్యం, ఆధునిక శస్త్ర చికిత్సలు అందించేలా 10 ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆధునిక ఆపరేషన్ థియేటర్లను రూ.10 కోట్ల విలువ చేస్తాయని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వీ.కుమార్ తెలిపారు. గత నెల రోజుల కాలంలో ఈ అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ల ద్వారా పీటీ సర్జరీకి సంబంధించి డాక్టర్ ఆర్‌వీ.కుమార్ ఆధ్వర్యంలో ఓపెన్ హార్ట్ సర్జరీలు, బైపాస్ సర్జరీలు 15కిపైగా పూర్తి చేశారు. గుండెకు సంబంధించి ఆపరేషన్ లేకుండా చేసే వాల్వ్ రీ ప్లేస్‌మెంట్ కోసం అధునాతన యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్విమ్స్ సంచాలకులు తెలిపారు.త్వరలో గుండె మార్పిడి శస్త్ర చికిత్స విధానం ప్రారంభిస్తామని, దీనికి సంబంధించిన అనుమతులు కూడా వెలువడ్డాయని తెలిపారు. వీలైనంత త్వరగా దీనిని చేపట్టడానికి 10 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లలో ఒక థియేటర్‌ను ఇందు కోసం కేటాయించామని పేర్కొన్నారు.

# ఆక్రమణను అడ్డుకున్న అధికారులు



ప్రభుత్వ స్థలంలో నిర్మాణాల కోసం వేసిన పిల్లర్లు

**చంద్రగిరి:** లక్షల విలువచేసే కుంట పొరంబోకు స్థలాన్ని ఓ రియల్టర్ ఆక్రమణకు యత్నించడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్న ఘటన శనివారం స్థానిక అరుణకాలనీ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తొండవాడ లెక్కదాఖల సర్వే నంబరు306/1లో 48 సెంట్ల గుర్రాలకుంట పోరంబోకు ఉంది. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో స్థానికంగా ఉండే ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కన్ను దానిపై పడింది. దీంతో రాత్రికిరాత్రి నిర్మాణ సామగ్రిని తీసుకొచ్చి, శనివారం ఆగమేఘాలపై కుంట పొరంబోకులోని కొంత భాగంలో పునాదులు తవ్వి పిల్లర్లను ఏర్పాటు చేశారు. స్థానికులు తహసీల్దార్‌కు శిరీషకు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు తొండవాడ వీఆర్‌ఓ యజ్ఞశ్రీ ఘటన స్థలానికి చేరుకుంది. అక్రమంగా జరుగుతున్న పనులను అడ్డుకుని, పిల్లర్ల కోసం ఏర్పాటు చేసిన ఇనుప కమ్మీలను తొలగించింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ...ప్రభుత్వ భూముల అక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. వెరిటాస్ ఉత్సవ్





వేడుకలను ప్రారంభిస్తున్న విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి, హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

**తిరుపతి రూరల్:** తిరుపతికి సమీపంలోని రామాపురంలో ఉన్న వెరిటాస్ సైనిక్ స్కూల్ 4వ వార్షికోత్సవంగా సందర్భంగా వెరిటాస్ ఉత్సవ్-2023 పేరుతో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం స్కూల్ ఆవరణలో జరిగిన ఈ వేడుకలకు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోనే ప్రైవేటు విద్యారంగంలో సైనిక శిక్షణతో స్థాపించిన అత్యున్నత సంస్థగా వెరిటాస్ నిలవడం గర్వకారణమన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు దేశానికి సుశిక్షితులైన భావి సైనికులను అందించడమే లక్ష్యమన్నారు. కేవలం విద్యనే కాకుండ అన్ని రంగాల్లో రాణిస్తూ జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పాఠశాల డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పలు శారీరక దృఢత్వ విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో వైస్ ప్రిన్సిపల్ రూపారాణి, అదనపు డైరెక్టర్ సారిక శ్రీకర్‌రెడ్డి, డీన్ ఖాన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వేడుకగా శ్రీషిరిడీసాయి మందిరం వార్షికోత్సవం



పురవీధుల్లో వేడుకగా శ్రీసాయిబాబా ఊరేగింపు

**తిరుపతి కల్చరల్:** కొంకా వీధిలోని శ్రీద్వారకామాయి శ్రీషిరిడీ సాయిబాబా మందిరం 22వ వార్షికోత్సవం వేడుకలు శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీషిరిడీ సాయిబాబా సేవా సమాజ్ ఆధ్వర్యంలో మందిరంలో స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు, హారతి సమర్పించారు. అనంతరం సాయినాథుని విశేష అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శనం కల్పించారు. కాగా మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీషిరిడి సాయి బాబా ఊరేగింపు ఘనంగా చేపట్టారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం, రవి, బాలకృష్ణ, శ్రీనివాసులు, మర్దం శివ, కళావతి, విజయలక్ష్మి, రమేష్, హరిబాబు, ఏఎస్ మూర్తి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎస్వీసీఈలో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు




ఫ్రెషర్స్‌డే సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు


**తిరుపతి సిటీ:** కరకంబాడి రోడ్డులోని ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా అడుగుపెట్టిన విద్యార్థినీవిద్యార్థులకు శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నైపుణ్యం కలిగిన ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగ, వ్యాపార అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కళాశాల యాజమాన్యం పలు శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యశాలలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ ఎ.గంగిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్, సెక్రటరీ ప్రదీప్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అవాస్తవాలు ప్రచారం చేయడం దారుణం

**తిరుపతి సిటీ:** ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఎస్వీయూలో ఔట్‌సోర్సింగ్ మ్యాన్ పవర్ నియామకాలు చేపట్టామని శ్రీనివాస డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ ఎండీ కె.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పక్కాగా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానాన్ని అమలు పరిచామన్నారు. వర్సిటీలో కొందరు వ్యక్తులు తమ సంస్థపై నిందలు మోపుతున్నారని విమర్శించారు. వర్సిటీ వీసీకి తప్పుడు సమాచారంతో వినతిపత్రం సమర్పించి, ఉద్యోగులలో అయోమయం నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. వర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నెలకు రూ.10,250 వేతనం చెల్లిస్తున్నామని, పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లిస్తున్నామని తెలిపారు. సోమవారం అన్ని విషయాలను ఆధారాలతో సహా వీసీకి, వర్సిటీ అధికారులకు విన్నవించి, అవాస్తవాలు ప్రచారం చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. సంస్థ పేరు ప్రతిష్టలకు భంగం కలిగే విధంగా వ్యవహరించిన వారిపై పరువునష్టం దావా వేయనున్నట్లు తెలియజేశారు.

## శ్రీవారి మెట్టు వద్ద ఘనంగా కార్తీక వనభోజనాలు





స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం



భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

**చంద్రగిరి:** పవిత్ర కార్తీకమాసం సందర్భంగా శనివారం శ్రీవారి మెట్టు వద్ద గల పార్వేట మండపంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని టీటీడీ అధికారులు వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకొచ్చారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. అనంతరం పార్వేట మండపంలో మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు కార్తీక వనభోజనోత్సవం జరిగింది. కార్తీక వనభోజనం మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నారాయణాచార్యులు, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ ప్రత్యేక అధికారి, టీటీడీ పీఆర్ఓ డాక్టర్ టి.రవి, వీజీవో బాలిరెడ్డి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్‌రాయులు, వెంకట స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు డి.నరసింహులు

**తిరుపతి కల్చరల్:** ప్రతి మంగళవారం స్థానికులకు తిరుమల శ్రీవారిని దర్శించుకునే విధానాన్ని టీటీడీ అధికారులు పునరుద్ధరించాలని విశ్వహిందూ పరిషత్ నేతలు డి.నరసింహులు, రమాదేవి, నాగరాజ శర్మ తెలిపారు. శనివారం కొత్తవీధిలోని పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో స్థానికులకు ప్రతి మంగళవారం శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని టీటీడీ కల్పించిందని తెలిపారు. టీటీడీ అధికారులు స్పందించి ఈ అవకాశాన్ని పునరుద్ధరించాలని కోరారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని గ్రామీణ స్థాయిలో ప్రతి ఇంటికి అయోధ్య ఆలయ ప్రారంభ ఆహ్వాన పత్రిక, అక్షింతలు, శ్రీరాముని చిత్రపటాలను అందించనున్నట్లు తెలిపారు.

### సోషల్ మీడియా మీటప్ విజయవంతం




మాట్లాడుతున్న ఎథికల్ హ్యాకింగ్ నిపుణుడు సతీష్ తదితరులు

**తిరుపతి కల్చరల్:** ఎయిర్ బైపాస్ రోడ్డులోని రోబో డైనర్‌లో శనివారం రాయలసీమ సోషల్ మీడియా మీటప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ జిల్లాలోని వివిధ పేజీ అడ్మిన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ సర్వర్స్ అధినేత, ఎథికల్ హ్యాకింగ్ నిపుణుడు సతీష్ వివిధ మోసాలు, హ్యాకింగ్ వంటి అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. సతీష్‌తోపాటు బ్యూటీఫుల్ తిరుపతి శశి, వెదర్ మ్యాన్ సాయి ప్రణీత్ వారి ప్రాంతాల్లో విశిష్టతను తెలియజేశారు. సంపాదన కోసం చెడు మార్గాలలో వెళ్లకుండా, మోసపోకుండా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాలని, ఊహ తెలియని చిన్నారులకు సెల్ ఫోన్లు ఇవ్వడం చేయ కూడదని తెలిపారు.

### నేడు గ్రూప్-1, 2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

**తిరుపతి కల్చరల్:** శేఖర్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ఎన్‌టీఆర్ సర్కిల్ ప్రకాశం రోడ్డులోని స్టడీ సర్కిల్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్-1, 2 పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో గ్రూప్-1, 2 మొదటి ప్రయత్నంలోనే జాబ్ సాధించడం ఎలా అనే అంశంపై అవగాహన కలిస్తామని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన హైదరాబాద్ ఫ్యాకల్టీతో ఇంటెన్సివ్ శిక్షణ ఉంటుందని, ఈ నెల 11 నుంచి శిక్షణ కోసం మొదటి బ్యాచ్ ప్రారంభం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 99631 01403, 96183 55389లను సంప్రదించాలని తెలిపారు.

### మహిళా వర్సిటీలో చేంజ్ యువర్ హ్యాబిట్స్‌పై అవగాహన



వర్క్‌షాపులో పాల్గొన్న ముఖ్యఅతిథులు, అధ్యాపకులు

**తిరుపతి సిటీ:** శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం చేంజ్ యువర్ హ్యాబిట్స్, చేంజ్ యువర్ లైఫ్ అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్, సైకాలజిస్ట్, యునిసెఫ్ సీనియర్ ఇన్వెస్టిగేటర్ వీఎస్ రమేష్‌బాబు విచ్చేసి విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ప్రతి వ్యక్తి జీవితంలో అలవాట్లు, పట్టుదల, సమయపాలన, నిరంతర కృషి ఎంతో ప్రముఖమైన పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉషారాణి, వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూమన కుటుంబ ఖ్యాతిని దిగజార్చేందుకు టీడీపీ కుట్ర



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆర్.అజయ్‌కుమార్

- అవినీతి అంటూ పచ్చ రాజకీయ అబద్ధపు విమర్శలు
- నిరూపణపై చర్చకు సిద్ధమా ఆనంకు వైఎస్‌ఆర్ సీపీ నేతల సవాల్

**తిరుపతి కల్చరల్:** తిరుపతి అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ అశేష ప్రజాదరణ పొందుతున్న భూమన కుటుంబం ఖ్యాతిని దిగజార్చాలనే కుట్ర రాజకీయాలకు తెరలేపుతూ టీడీపీ నేతలు అసత్య విమర్శలు గుప్పిస్తున్నారని వైఎస్‌ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆర్.అజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రజా ఛీత్కారానికి గురైన టీడీపీ నేతలు అధికార దాహంతో పచ్చి అబద్ధపు మాటలతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నానికి దిగడం సిగ్గుమాలిన చర్య అన్నారు. టీడీపీకి రాజకీయ బ్రోకర్‌గా వ్యవహరిస్తూ ఆనం వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డిపై అవినీతి నిందారోపణలు చేస్తూ పచ్చ రాజకీయ విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. గతంలో టీటీడీ చైర్మన్‌గా పూర్తి స్థాయిలో సమగ్రమైన విధులు నిర్వహించి అశేష భక్తజనం మన్ననలు అందుకున్నారన్నారు. అదే తరుణంలో తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ చేపట్టాలని స్వయంగా నిరాహారదీక్షకు కూర్చున్న దమ్మున్న నాయకుడు భూమన కరుణాకరరెడ్డి అని స్పష్టం చేశారు. ఆయన నిజాయితీ తెలిసిన ప్రభుత్వమే ఈ విషయంపై వెనక్కు తగ్గిందన్న విషయాన్ని గుర్తుంచుకోలన్నారు. తిరుపతిలో టీడీఆర్ బాండ్స్ జారీలో 4 వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారని అబద్ధాలను ప్రచారం చేయడం టీడీపీ కుట్ర రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని, ఆనం వెంకటరమణారెడ్డి సైతం సిద్ధం కావాలని ఆయన సవాల్ విసిరారు. ఈ సమావేశంలో వైఎస్‌ఆర్ సీపీ నేతలు పసుపులేటి సురేష్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, పుల్లూరు అమరనాథరెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మహేష్, శేఖర్ పాల్గొన్నారు.

## టీటీడీని రాజకీయ వేదికగా మార్చొద్దు

**తిరుపతి కల్చరల్:** కొన్ని రోజులుగా తిరుమలలో అన్నప్రసాదం, స్వామి దర్శనంపై సిబ్బంది తీరు, లోటుపాట్లను సోషల్ మీడియా పోస్టులు చేస్తూ టీటీడీని తమ రాజకీయాలకు వేదికగా మార్చుతూ కొందరు రాజకీయనేతలు చేస్తున్న విధానాలను మానుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు అలిపిరి గరుడ సర్కిల్ వద్ద టీటీడీకి వ్యతిరేకంగా మాట్లాడే విమర్శకులకు చేతులెత్తి దండం పెడుతూ వేడుకున్నారు. సోషల్ మీడియా ద్వారా టీటీడీ గురించి దుష్ప్రచారం చేయకుండా చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## సామాజిక సేవలో కాండర్ విద్యార్థులు



ఆశ్రయ కేంద్రంలో నిత్యావసరాలు అందజేస్తున్న కాండర్ స్కూల్ విద్యార్థులు

**తిరుపతి రూరల్:** కాండర్ స్కూల్ విద్యార్థులు చదువులతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటున్నారు. స్కూల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతి జిల్లాలోని తెలుగు తల్లి ఓల్డ్ ఏజ్ హోమ్, మాతృశ్య చైల్డ్ హోమ్, అభయ క్షేత్రం, పాస్ మనోవికాస్, ఆశ్రయ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థలకు అధిక మొత్తంలో విరాళాలు అందజేశారు. కంది పప్పు, బియ్యం, మైదా, గోధుమపిండి, సబ్బులు, పేస్ట్, బ్రష్‌లు, బెడ్ షీట్లు, వంట నూనె, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, స్కెచ్‌లు, కలర్ పేపర్లు, వైట్ పేపర్లు, ఆడుకొనే వస్తువులు ఇచ్చారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే హృదయాన్ని కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయిని నాగ శ్వేత ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## దేవరకొండపై విశేష పూజలు



దేవరకొండ శ్రీవెంకటేశ్వర స్వామి

**భాకరాపేట:** చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్తీక శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. దేవరకొండ కల్యాణ మండపంలో శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున చెక్కభజనలు, పిల్లనగ్రోవులు, తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు దేవరకొండపై వైభవంగా సాగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## చదువుకోవడం ఇష్టం లేక విద్యార్థి ఆత్మహత్య



సాహితీ మృతదేహం

**తిరుపతి క్రైమ్:** చదువుకోవడం ఇష్టం లేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. వెస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మగుంటలో నివాసముంటున్న వీర వెంకటప్రతాప్ కుమార్తె సాహితి(18) ప్రకాశం జిల్లా కనిగిరిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే ఈమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఇటీవల తల్లిదండ్రులు అపెండిసైటిస్ ఆపరేషన్ కూడా చేయించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థి అంత దూరం వెళ్లి చదువుకోవడం ఇష్టం లేక.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో ఉన్న తల్లిదండ్రులు గమనించి రుయా హాస్పిటల్‌కి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

## నిత్యాన్నదానానికి విరాళం

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానం నిత్యాన్నదానం, గోసంరక్షణ పథకానికి చెన్నైకు చెందిన శ్రీకైలాస ట్రస్ట్ అధినేత ఎస్.రాజకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి విరాళం అందజేశారు. నిత్యాన్నదాన పథకానికి రూ.68,880, గో సంరక్షణకు రూ.5000 ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కలసి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి,అమ్మవార్ల శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.